క్లుప్తంగా

మెరుగైనది ఆయుర్వేద విధానం



తెనాలి: పట్టణ కొత్తపేటలోని నూతనంగా ఏర్పాటుచేసిన కశ్యప్ ఆయుర్వేదిక్ హాస్పటల్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ప్రారంభించారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం మెరుగైన వైద్యవిధానమని చెప్పారు. హాస్పటల్ అధినేత చావా సాకృత, డాక్టర్ చావా మహిత, చావా యదుకృష్ణ, డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ జి.సాంబశివ రావు, సాయి రామమోహనరావు, ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ ఆవుల చక్రవర్తి చావా బాబ్జీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వైష్ణవి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



కె.శ్రీరామ్



డి.వి.వి.సాయి రామ్ చరణ్

తెనాలిఅర్బన్: ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు కె.సాయి రామ్, డి.వి.వి.సాయి రామ్ చరణ్‌లు రాష్ట్ర స్థాయి ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ విభాగంలో 1000 మార్కులు 955 మార్కులు సాధించినట్లు చెప్పారు. రూ.20వేలు నగదు ప్రోత్సాహక బహుమతితో పాటు మెడల్స్ అందజేయనున్నట్లు వివరించారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. మారీసుపేటలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న గ్యాంగ్ వర్క్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలోని వ్యర్థాలను రోడ్ల ప్రక్కన పడవేయడాని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు ఉన్నారు. అలాగే అమరావతి ప్లాట్స్‌లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతిరావు పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు ఉన్నారు.

రేపు సరస్వతీ దేవాలయ భూమిపూజ



తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న 'సువర్ణ భారతి క్షేత్రం' (సరస్వతి దేవాలయం)కు ఈనెల 7న జరగనున్న భూమి పూజ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ)చే ఆరోజు ఉదయం 7.45 గంటలకు విశేష హోమాలు, పూజలు ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామీజీతో పాటు ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, తాడిబోయిన వీరరాఘవయ్య, ఏలూరి రాజేశ్వరరావు, పసుపులేటి మాణిక్యారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ త్రీ టౌన్ స్టేషన్ పరిధిలో నివసించే 23 ఏళ్ల ప్రైవేటు స్కూలు టీచర్ చైతన్య బాలకుమారి కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మొక్కలు నాటి నీరు పోస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో అమరావతి ప్లాట్స్‌లోని సి-బ్లాక్ మున్సిపల్ స్థలంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి హానీ కలిగించే వస్తువులను ఉపయోగించరాదన్నారు. వీటిలో తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయని, వాటికి ప్రజలందరూ దూరంగా ఉండాలన్నారు. మొక్కలు నాటడం వలన మనిషి జీవించేందుకు అవసరమైన ఆక్సిజన్‌ను అవి సరఫరా చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, కౌన్సిలర్లు మట్లపూడి సంధ్యారాణి, యాతాటి అనిల్, మేనేజర్ విల్సన్ జయకర్, ఇన్‌ఛార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్లపూడి రాజశ్వేరరావు, స్థానికులు పాల్గొన్నారు.

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో మేనేజర్ ఎ.రాజశేఖర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు భూతాపాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐజె ప్రసాదరావు, ఏఈఎం అభిరామ్ నాయక్, ఆర్‌హెచ్‌సీ ఎస్.శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తెనాలిరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి న్యాయస్థానాల ప్రాంగణంలో తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. వివేక్ వర్ధన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ సమతుల్యం కోసం మొక్కలు నాటాలని సూచించారు. అలానే కాలుష్యాన్ని నివారించడం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రవిరాజు, నరాలశెట్టి సురేష్, కామినేని చిన్న, అడక వెంకటేశ్వరరావు లీగల్ సర్వీసెస్ కో ఆర్డినేటర్లుంటి మహబూబ్, కోర్ట్ సిబ్బంది, నాయవాదుల గుమస్తాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటి, ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు.



ఐతానగర్ ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ సిబ్బంది

ప్రతి వ్యక్తి మొక్కలు నాటాలి

కొల్లిపర: ప్రతి వ్యక్తి సంవత్సరంలో ఒక్కసారి అయినా ఒక మొక్క నాటాలని తద్వారా వాతావరణంలో ఏర్పడే కాలుష్యాన్ని నివారించవచ్చని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల వలన మానవాళికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్డీ సి.హెచ్.భార్గవ, ఏవో వి.ప్రతాపరెడ్డి, ఎస్.ఎ బి.శ్రీనివాసమూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకయ్య, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్, ఆర్‌డబ్ల్యూవో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



కొలకలూరులో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం వివిధ రూపాల్లో కోరలు చాస్తుందని వెల్లడించారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని సూచించారు. మండల వ్యాప్తంగా రెండు వేల మొక్కలను అన్ని గ్రామాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల వెంబడీ మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, సర్పంచ్ చొప్పర ప్రీతి, పంచాయతీ కార్యదర్శి ఎండీ కరిముల్లా, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మావతి



ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న మేనేజర్ రాజశేఖర్

- స్థానిక ఐతానగర్ ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి బెల్లకొండ వెంకట్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ విద్యార్థులు పాఠశాల పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. హెచ్ఎం ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం అభినందనీయమని కొనియాడారు. మానవజాతి మనుగడకు మొక్కలే జీవనాధరమని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గాలి కిరణ్, బసవేశ్వరరావు, సూరజ్, సాయి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కొనసాగిన వ్యవసాయ, ఉద్యాన అధికారుల శిక్షణ

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన



దావులూరులో ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్ పొలం సందర్శన

తెనాలి: గుంటూరు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన అధికారులకు జరుగుతున్న మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా గురువారం విస్తృతంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొల్లిపర మండలంలోని దావులూరిపాలెం గ్రామంలో రైతు పృథ్వి అరటి ఏ-గ్రేడ్ ఏటీఎం పంట పొలాలను సందర్శించారు. వివిధ పరికరాల ద్వారా బ్రిక్స్ వాల్యూ, బీహెచ్ వాల్యూ, నేలలోని ఉష్ణోగ్రత, తేమ శాతాన్నీ పరీక్షించి ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రత్యక్షంగా చూశారు. తదుపరి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజ కుమారి ప్రకృతి వ్యవసాయంలో జీవన ఉత్ప్రేరకాలు తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం రైతు వసంతమ్మ ఏటీఎం, అరటిలో వేసిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పొలం, శ్రీలక్ష్మీ న్యూట్రి గార్డెన్‌ను సందర్శించారు. దావులూరులో గొట్టుముక్కల శ్రీధర్ వరి ప్రధాన పంటపై అమలు చేస్తున్న ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్ ఇరవై ఐదు ఎకరాల బ్లాక్ ను పరిశీలించారు. తెనాలి మండల గ్రామం ఎరుకలపూడిలో బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్‌ను సందర్శించి, ఉర్వి యాప్‌లో డేటా అప్లోడ్ ప్రక్రియలను అధ్యయనం చేశారు. అలాగే అదే గ్రామంలో ఉన్న ఉత్తమ ప్రకృతి రైతులు, సంఘ సభ్యులు, కేడర్‌లతో చర్చలు జరిపి వారి అనుభవాలను తెలుసుకున్నారు. వరి పంటల్లో గట్టుపై మొక్కలు పెంచే అంశాన్ని కూడా వారు గమనించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను, వివిధ మోడల్స్ అమలులో ఉన్న విశిష్టతలను డీపీఎం రాజకుమారి వివరించారు. స్టేట్ టీం బాజీబాబు, అడిషనల్ డీపీఎమ్, వ్యవసాయశాఖ, ఉద్యాన అధికారులు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం తెనాలిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ ఆశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ రామలింగేశ్వరపేట, చినరావూరు, తోటవారి వీధి-1,2, డొంక రోడ్డు, రాజుల కాలనీ, రైస్ కాలనీ, అమరావతి ప్లాట్స్, ఇందిరానగర్, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, కుమార్ కాలనీ, రూరల్ ప్రాంతాల్లో అత్తోట రోడ్డు, ఇండస్ట్రీయల్ ఏరియా, నందివెలుగు గ్రామంలో ఉదయం8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని కోరారు.

మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం

తెనాలిటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ గాలిముట్టి మోహనరావు సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలోని నివాసం వద్ద మోహనరావు భౌతికాయాన్ని నేతలు సందర్శించి ఘన నివాళులర్పించారు. రైస్, డాల్‌మిల్ యూనియన్ నాయకుడుగా కార్మికుల హక్కుల కోసం మోహనరావు చేసిన కృషి అనిర్వచనీయమని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘకాలం సీపీఎం పార్టీలో సేవలందించారని అన్నారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. మోహనరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో కె.బాబుప్రసాద్, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ, జి.ఆగస్టీన్, కె.రవి, ఎస్.రాజ్యలక్ష్మి, చుక్కపల్లి శేషగిరిరావు, జి.వెంకటసుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి నిర్వాహకులు కుర్రా శ్రీను మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, పి.నవీన్, అబ్రహాం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మధురకవి అబ్రహం రచనలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా, తదితరులు

తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహం రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం మధురకవి నూతక్కి అబ్రహం 26వ వర్థంతి ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవేదిక వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా ప్రియ శిష్యునిగా ఎన్నో రచనలకు అబ్రహాం శ్రీకారం చుట్టారని కొనియాడారు. అబ్రహం కొలకలూరు గ్రామంలో జన్మించడం గర్వకారణంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, బర్తిపూడి వెంకటేశ్వరరావు, సుద్దపల్లి నాగరాజు, ఉన్నం ధర్మారావు, కూచిపూడి మోహన్ మాదిగ, కొలకలూరి పాపారావు, నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి, నూతక్కి అచ్యుతచారి, ఉన్నం భూషణం, సొపాటి కోటేశ్వరి, గద్దె ఝాన్సీ, ఉన్నం సన్నీ, అనిల్, స్వరాజ్ వర్మ, అవినాష్, సతీష్, మణిహర నాయుడు, తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్ భారీ కాంస్య విగ్రహం

జగ్గయ్యపేటలో ప్రతిష్ఠకు తరలించిన కమిటి



ఛత్రపతి శివాజీ విగ్రహంతో కమిటీ సభ్యులు, అభిమానుల నినాదాలు

తెనాలి: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ప్రతిష్ఠించేందుకు ఛత్రపతి శివాజీ మహారాజ్ భారీ కాంస్య విగ్రహం సిద్ధమైంది. స్థానిక సూర్యశిల్పశాలలో 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవి చంద్ర ఆధ్వర్యంలో 10 అడుగుల ఎత్తు, 1200 కిలోల బరువుతో మూడునెలల వ్యవధిలో దీనిని తయారుచేశారు. గురువారం ఈ విగ్రహాన్ని జగ్గయ్యపేటకు తరలిస్తున్న సందర్భంగా మీడియాకు ప్రదర్శించారు. విగ్రహ నిర్మాణ కమిటీ, హిందూ చైతన్యవేదిక, జగ్గయ్యపేట ఆర్డరుపై దీనిని తయారుచేసినట్టు తెలిపారు. తెనాలి వచ్చి విగ్రహాన్ని పరిశీలించిన కమిటి సభ్యులు పబ్బతి నరేంద్ర, పిన్నం వెంగళరావు, సంకా భాస్కర్, నోముల రవి, అల్లి రవిచంద్ర తదితరులు తెనాలి శిల్పుల కళానైపుణ్యాన్ని ప్రశంసించారు. జగ్గయ్యపేట దుర్గాపురం ఏరియాలోని శివాజీ సర్కిల్‌లో ఈ విగ్రహాన్ని ఈనెల 9న ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం హిందూ సమ్మేళన సభ జరుగుతుందని తెలిపారు. తెనాలి ప్రాంత ఛత్రపతి శివాజీ అభిమానులు, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు హాజరై 'ఛత్రపతి శివాజీ మహారాజ్‌కీ జై, భరతమాతకీ జై' అంటూ నినాదాలు చేశారు.

డాక్టర్ హెలెన్ నిర్మల సేవలు మరువరానివి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



డాక్టర్ హెలెన్ నిర్మలను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మున్సిపల్ ఆరోగ్యాధికారిణిగా డాక్టర్ కె.హెలెన్ నిర్మల అందించిన సేవలు మరువరానివని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. డిప్యూటేషన్ ముగించుకుని మాతృశాఖకు వెళ్తున్న ఆమె వీడ్కోలు సభను మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు ఆమె తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధరణమని చెప్పారు. డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మూడు సంవత్సరాలు ఆరోగ్యాధికారిణిగా పనిచేయడం జరిగిందన్నారు. డిప్యూటేషన్ గడువు ముగియడంతో వైద్య ఆరోగ్యశాఖలో రిపోర్ట్ చేయనున్నట్లు చెప్పారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, టీపీవో సాంబశివరావు, ఏఈ సూరిబాబు, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శ రాజకీయవేత్త కన్నెగంటి రెడ్డమ్మచౌదరి

శతజయంతి సభలో ఘననివాళి

తెనాలి: ఉన్నత వ్యక్తిత్వంతో ఆదర్శ రాజకీయాలను గడిపిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కన్నెగంటి రెడ్డమ్మచౌదరి జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని గురువారం జరిగిన శతజయంతి వేడుకలో పలువురు అభిప్రాయపడ్డారు. శ్రీకన్నెగంటి రెడ్డమ్మచౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రం హాలులో చిన్నారులకు జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో రెడ్డమ్మచౌదరి శతజయంతిని నిర్వహించారు. రెడ్డమ్మచౌదరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రకాశం జిల్లాతో సహ కలిగిన నాటి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా రెండు పర్యాయాలు చేసిన రెడ్డమ్మ చౌదరి పలు సంస్కరణలను ప్రవేశపెట్టినట్టు కిసాన్‌సంఘ నాయకుడు అమ్మిశెట్టి అర్జునరావు చెప్పారు. రైతులకు రుణాల పంపిణీలో నగదు చెల్లింపుల స్థానంలో చెక్కుల విధానాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. మారుతున్న రాజకీయాల్లో కొనసాగలేక, తనకు తానే స్వచ్ఛందంగా రాజకీయాల్నుంచి వైదొలగినట్టు చెప్పారు. విద్యా వ్యాప్తికి, సాహిత్య అభివృద్ధికి, క్రీడాకారులకు ఆర్థిక సహాయం చేస్తూ సమాజసేవలో గడిపారని వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బైసాని సూర్యనారాయణ సభానిర్వహణ చేశారు. ప్రధానోపాధ్యాయిని ఆర్.నిర్మలకుమారి, ఆఫీస్ ఇన్‌ఛార్జి కె.సంధ్యారాణి, సీనియర్ టీచర్లు కె.శ్యామల, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కన్నెగంటి రామరాయచౌదరి పర్యవేక్షించారు.


నిరుపేద యానాదులకు నూతన వస్త్రాల పంపిణీ

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కాలవగట్టు పక్కన చెట్లకింద జీవిస్తున్న నిరుపేద యానాదుల సమక్షంలో గురువారం తెనాలికి చెందిన సినీదర్శకుడు దిలీప్‌రాజా జన్మదినాన్ని జరుపుకున్నారు. అక్కడి కుటుంబాలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. విద్యుత్, తాగునీరు లేని ఆ నిరుపేద కుటుంబాల మధ్యన రోజంతా గడపటం మరచిపోలేని అనుభూతిగా తెలిపారు. జన్మదిన వేడుకల పేరిట కేక్ కటింగ్ వంటివి తనకు నచ్చవని చెప్పారు. చెట్ల కింద దయనీయంగా బతుకుతున్న యానాదులకు తాగునీటి వసతి కోసం మంచినీటి పంపును ఏర్పాటుచేస్తానని హామీనిచ్చారు. బసవరత్న, బున్నీ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన ఉద్యోగులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరగనున్న మహాసభలకు తెనాలి నుంచి పలువురు ఉద్యోగులు ప్రత్యేక బస్సులో వెళ్లారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘనాయకులు శివరాత్రి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, కారుమూరి కమలకుమారి, మనోహర్‌రెడ్డి, దగ్గుపాటి సుధీర్‌కుమార్, గుంటూరు పూర్ణప్రసాద్, దీపాల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల వితరణ



తెనాలి: సాయిబాబాకు అత్యంత ప్రీతి పాత్రమైనది అన్నదానమేనని శ్రీసాయిప్రసాదం సేవా సమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు అన్నారు. చిన రావూరు డొంకలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం అక్కడి కాలనీలో గల పేదలకు శ్రీసాయి ప్రసాదం సేవాసమితి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను వంద మందికి పంపిణీ చేశారు. కేశవమఠం అప్పయ్య, లక్ష్మీనాంచారమ్మ స్మృత్యర్థం వారి కుమారుడు వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ అన్నదానం చేశారు. సేవా సమితి అధ్యక్షులు సాయి లక్కరాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గురువారం పట్టణంలోని వివిధ కాలనీల్లో ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని క్రమం తప్పక నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరైనా కోరితే వారు నివసించే కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. సమితి సభ్యులు సురేష్, రమణయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి మధ్యాహ్నభోజనం అందించండి

ఎంఈవో-2 జయంతిబాబు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని అందించాలని తెనాలి మండల విద్యాధికారి-2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని మధ్యాహ్న బడి భోజన ఇన్‌ఛార్జ్‌లు, వంట, హెల్పర్‌లతో మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్ఎంహెచ్ స్కూల్‌లో ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా విద్యను ప్రోత్సహించవచ్చని తెలిపారు. అలాగే పేద పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 12వ తేదీ నుండి పాఠశాలలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అందరూ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వంట పాత్రలు, గది ఎప్పుడు శుభంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. కాకుమాను మండల ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకురాలు, రీసోర్స్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ భోజనం వడ్డించే సమయంలో గ్లౌజ్‌లు తప్పని సరిగా ధరించాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయలు పఠాన్ కరిముల్లా, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకం సక్రమంగా నిర్వహించాలి

కొల్లిపర: పాఠశాలలు ప్రారంభం కాగానే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి-1,2 జి.సల్మాన్‌రాజు, కె.ఝాన్సీలతలు అన్నారు. కొల్లిపరలోని జడ్‌పీహెచ్ స్కూల్ నందు గురువారం మధ్యాహ్నం భోజనం వండే వారితో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో-1,2 లు మాట్లాడుతూ మెనూ ప్రకారం సూచిగా, శుభ్రంగా వండి వేడిగా వడ్డించాలని, ప్రధానోపాధ్యాయుల సహకారంతో మధ్యాహ్న భోజనం సరైన ప్రమాణాలతో తయారు చేసి అందించాలన్నారు. అనంతరం జరిగిన వంటల పోటీలో గెలుపొందిన వారికి వివిధ కేటగిరిల ప్రకారం బహుమతులు అందజేశారు. వల్లభాపురం జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న హెల్పర్ దేవకుమారి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో జడ్‌పీహెచ్ఎస్ కొల్లిపర హెచ్ఎం సౌజన్య, పిడపర్తి రమేష్‌బాబు, వై.రాంబాబు, వి.మురళి, బి.అలేఖ్య, డి.స్వరూపరాణి, ఎంఎస్ రమేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com